# చేబదులు కోసం

ఉద్యోగం చేస్తున్నవాణ్ణి, ప్రస్తుతం డబ్బులేనివాణ్ణి నడుస్తున్నాను.

'ఎందుకు? ఎక్కడికి?'

'జేబులో రెండు చెల్లనిపావలాలు ఉన్నాయి. అవి ఒక పావలాకి మార్చవచ్చు' అందుకు.

'ఎక్కడికి?'

'అవి మార్చేచోటుకు.'

'ఎన్నిచోట్ల ప్రయత్నించేను!'

'ఇప్పటికి ఆరుచోట్ల.'

'ఏ యే చోట్ల?'

'ట్రాములైను ప్రక్కనున్న కిల్లీలదుకాణంలో దాని ప్రక్కనున్న బేకరీలో, దాని ప్రక్కనున్న లాండ్రీలో, దాని తరవాత వున్న క్షవరశాలలో, దానిప్రక్కనున్న పళ్ళదుకాణంలో!'

'ఆ తరువాత?'

'ఒక సందు.'

'అప్పుడేమిటి చేశాను?'

'సందులోకి వెళ్ళలేదు.'

'వెళ్ళక?'

'సందుకి అటువేపువున్న దుకాణాలకి వెళ్ళాను. ఈ దుకాణాలు ఎటువేపువున్నాయి. కుడిపక్కా, ఎడంపక్కా

ఇప్పుడు ప్రస్తుతం దిక్కులు తెలీవు. ప్రయత్నించి ఎలాగైనా చెప్పాలి. అవును. దుకాణాలవైపు ముఖంపెడ్తే నా కుడిచేతి వైపు ఇంతకుముందు చెప్పిన అంగళ్లు ఉన్నాయి. దుకాణాల వైపు వీపుపెడ్తే నా కుడిచేతిపక్క తరవాత చెప్పబోయేవి ఉన్నాయి!'

'తరవాత ఏవేవి చూశాను?'

'ఒక తాంబ్రేలు కొట్టు. దానిపక్క డబ్బా టీ దుకాణం.'

'నా శ్రయత్నం కొనసాగిందా?'

'ఆ దుకాణాదారులు నాగురించి ఏమనుకొంటూ ఉంటారు?'

'వీడో పచ్చి దగుల్బాజీ. డబ్బులేనివాడు. ఎక్కడో రెండు పావలాలు సంపాదించాడు. మాడ్చుకొని యింత తిండి తింటాడు.'

'ఈ అభిప్రాయాలకి ఆధారాలు ఉన్నాయా?'

'ఊఁ!'

'ఏమిటి?'

'ఒకటి నారూపు, రెండు నామాటలు, మూడు ప్రవర్తన.'

'రూపు ఎలా ఉంది?'

'కొంచెం మాసిన గెడ్డం. ఆకలితో బాధపడుతున్న కళేబరం. జాలిగా ప్రాణం. అలుగుపళ్లాంటి బట్టలు. మాట

లలో ప్రాధేయపడటం. తడుముకోడం. భాష సమంగా రాక పోవడం.'

'ప్రవర్తన?'

'ఏమో?'

'అవుతే మరేం చేశాను?'

'ఏడో చోట ప్రయత్నించేను.'

'సఫలమైందా?'

'ఊఁ'

'ఇదెక్కడ?'

'ఒక కాఫీకొట్లో.'

'ఎందువల్ల?'

'ఈ కాఫీహోటల్లో చాలాసార్లు నేను కాఫీతాగుతూ ఉండడంవల్ల.'

'ఎలా నచ్చచెప్పాను? పర్సుపోయింది అని, జేబులో ఈ పావలా లున్నాయని, అంతదాకా ఈ రెండూ ఉంచుకొని ఓ పావలాయిస్తే రూముకివెళ్ళి డబ్బు తెచ్చుకొని మళ్ళి ఇవి తీసుకుంటాననీ.'

'నమ్మాడా?'

'ఊఁ!'

'ఉద్యోగం చేస్తున్నవాణ్ణి, ప్రస్తుతం డబ్బు (ఒక పావలా) గలవాణ్ణి. అణాపెట్టి అరకప్పు కాఫీ తాగేను. అణాపెట్టి రెండు విల్సు సిగరెట్లుకొన్నాను. సిగరెట్టుకాలుస్తూ నడుస్తున్నాను.'

'ఎక్కడికి?'

'బస్సెందుకి?'

'ఆఁ. అయితే ఇదంతా ఏ ఊళ్ళో?

'ఒకానొక నగరంలో. బస్సుకోసం నిరీక్షిస్తున్నా.'

'బస్సు వచ్చిందా?'

'రాలేదు. సిగరెట్టు పారేశాను. దిక్కులు చూస్తున్నాను. ఆలోచిస్తున్నాను.'

'ఏమని?'

'.........'

బస్సు రాలేదు. విసిగిపోయి రెండో సిగరెట్టు ముట్టించేను. బస్సు వచ్చింది. ఎక్కాను. కండక్టరు సిగరెట్టు కాల్చకూడదు, ఆర్పే అన్నాడు. బస్సు దిగిపోయేను. ట్రాముకోసం కాచుక్కూర్చున్నా. లేదు. కాచుకొని నిలుచున్నా. సిగరెట్టు ఆరిపోయింది. ట్రాం వచ్చింది. ఎక్కేను.'

'ట్రాములో తెలిసిన మొగాలు ఉన్నాయా?'

'ఊఁ.'

'ఏమిటవి?

'ట్రాం మోటారుమేన్. కండక్టర్లలో ఒకడు.'

'పిళ్ళా? పాసింజర్లలో?'

'ఒక్కడూ లేడు.'

'టిక్కెట్టు కొన్నావా?'

'ఊఁ.'

'ఎంత అయింది!'

'ఏడుకాన్లు.'

'అసలు ముందు కొనదలచుకున్నావా?'

'ఊఁ హాఁ.'

'ప్యాసు వుందా?'

'ఆ మాత్రం అనుకోడా, మనం మౌనంగా ఉంటే_ అని అనుకున్నా. కాని దగ్గరకొచ్చి టిక్కెట్టు అని మొఖం మీద కళ్ళుపెట్టి అడిగాడు.'

'అప్పుడు ఏంచేశాను?'

'పరధ్యానంగా ఉన్నట్టు నటించేను.'

'తరువాత?'

'బేడ ఇచ్చేను ఎక్కడికని అడిగాను. చెప్పేను. కానీ లేదు. తరువాత ఇస్తానన్నాడు."

'ట్రాంలో నించున్నావా! కూర్చున్నావా?'

'కొంతదాకా కూర్చున్నా. గాని ఆడవాళ్ళెవరో వస్తే లేచివాళ్ళకి చోటు ఇచ్చాను.'

'వాళ్ళెవ్వరో తెలుసా!'

'తెలీదు.'

'ఎన్ని ఏళ్ళవాళ్ళు?'

'వరసగా ఇరవైరెండు – పద్ధెనిమిది.'

'ఇరవై ఏళ్ళ అమ్మాయి ఎలా ఉంది?'

'బాగానే వుంది.'

'ఏం కులం?'

'కిరస్తానీ. చీరకట్టుకొని ఉంది.'

'ఏ రంగు?'

'చాక్లెట్.'

'ఏ అంచు?'

'ఎర్రంచు.'

'జాకెట్?'

'బుట్ట చేతులది.'

'వీ మెడా?'

'ఊఁ'

'పద్ధెనిమిది ఏళ్ళపిల్ల?'

'ఊఁ హూ_బావులేదు.'

'ఆ కులమేనా?'

'ఆంగ్లో ఇండియన్ గౌను తొడుక్కుంది — బంతి పువ్వు రంగుంది. ఎత్తుమడమల జోళ్లు తొడుక్కుంది. చేతి సంచీ పట్టుకొంది.'

'తొలి అమ్మాయి వచ్చి, రెండోపిల్ల ఎందుకు బావు లేదు?'

'.........'

'ఇవన్నీ ఎందుకు పరిశీలించేను?'

'నాకు కళ్ళున్నాయి.'

'ఉంటే?'

'చూశాను.'

'చూసి?'

'నాకు మెదడుంది, ఆలోచించాను.'

'ఆలోచించి?'

'అనుకొన్నాను.'

'ఏమని?'

'తొలిఅమ్మాయి బావుంది అని.'

"ఎలా?"

"నా మెదడులో వున్న అరలో ఇమిడింది అంటేను"

"ఇంతలో వాళ్ళు దిగిపోయేరు. నే నేం చేశాను?"

"దిగుదామనుకున్నా."

"ఎందుకు?"

"వాళ్ళ వెనుకాతల వెళదా మనుకొన్నాను."

"ఎందుకు?"

"........."

"దిగావా?"

"లేదు."

"ప్రస్తుతం ఓ స్నేహితుడిదగ్గరికి వెళ్ళి ఓ మూడురూపాయలు చేబదులు అడుగుదామని బయల్దేరాను. వెళ్ళి అవి సంపాదించుకొంటే కొంతసేపు హాయిగా బతకొచ్చు."

"ట్రామువాణ్ణి కాలణా అడిగావా?"

"ఊం. అసలు కాణీకి కక్కుర్తి ఎందుకు? పోనీ వాణ్నే తిననీ అని అనుకొన్నా. కానీ కాణీయిస్తే పాసింగుషో కాల్చుకోవచ్చు."

"ఇచ్చేశా?"

"ఊం. తీసుకున్నా."

"ట్రాము దిగేను. నడుస్తున్నా. స్నేహితుడిదగ్గరికి. నేను ఉద్యోగం చేస్తున్నవాణ్ణి ప్రస్తుతం ఓ కాణీ ఆస్తి ఉన్న వాణ్ణి. స్నేహితుడికోసం చేబదులుకోసం నడుస్తున్నాను.